# నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల మంగళవారం 2 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## రేపటి నుంచి 'పది' మూల్యాంకనం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 1 : జిల్లా కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డీఈవో యాదయ్య సోమవారం వెల్లడించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం జరుగుతుందని, దీని నిర్వహణ కోసం ఏడుగురి అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, 66 చీఫ్ ఎగ్జామినర్లు, 384 అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 128 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించామని పేర్కొన్నారు. విధుల్లో పాల్గొనే వారు మొబైల్ వాడరాదని, 3న ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని, సమయపాలన పాటించాలని కోరారు. విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు రిలీవింగ్ ఆర్డర్‌తో పాటు బోధనానుభవం సర్టిఫికెట్, ఫొటో తీసుకొని రావాలన్నారు.

## నిషేధాజ్ఞల కొనసాగింపు

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 1: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగగిస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. డీజే, డ్రోన్‌లపై ఉన్న నిషేధాజ్ఞలను కూడా పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 1 నుంచి మే 1 వరకు ఇవి అమలులో ఉంటాయని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియులు చేస్తున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

## అంకూశపూర్ భూముల్లో జాయింట్ సర్వే నిర్వహిస్తాం



ఎఫ్ఆర్వో, ఎస్ఐతో మాట్లాడుతున్న రైతులు

భీమారం, ఏప్రిల్ 1 : అంకూశపూర్ భూముల్లో రెవెన్యూ, అటవీశాఖ ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహిస్తామని మంచిర్యాల ఎఫ్ఆర్వో రత్నాకర్ రావు అన్నారు. సోమవారం పోలంపల్లి గ్రామ పంచాయతీలోని అంకూశపూర్ శివారులో ఎస్ఐ రాములతో కలిసి అటవీ భూములకు హద్దులు ఏర్పాటు చేశారు. 30 ఏళ్లుగా సర్వే నంబర్ 140లో దాదాపు 100 ఎకరాల భూమి సాగు చేస్తున్నామని, అటవీశాఖ అధికారులు వచ్చి వేధింపులకు గురిచేస్తున్నారని స్థానిక రైతులు వారి దృష్టికి తీసుకొచ్చారు. కేసీఆర్ సర్కారులో 10 ఏళ్లపాటు ఏ ఒక్క అటవీశాఖ అధికారి రాలేదని, ఇప్పుడు నిత్యం వస్తూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రత్నాకర్‌రావును వివరణ కోరగా.. నేరస్తులు చెబితే తామెలా పరిగణలోకి తీసుకుంటామన్నారు. రైతులు దుర్గం శివకుమార్, దుర్గం రాములు, కుమర శ్రీనివాస్, ఆకుదారి రాజం, దర్శనాల రమేశ్, కోట పోశం, దుర్గం మధూకర్ ఉన్నారు.



చెలిమెల ప్రాజెక్టు

# కాలువ పారదు.. కరెంట్ ఉండదు..

**అగమ్యగోచరంగా తిర్యాణి మండల రైతుల పరిస్థితి**

- చెలిమెల ప్రాజెక్టు కాలువల నిండా పిచ్చిమొక్కలు
- బోరు బావుల నీళ్లు పెడుదామంటే విద్యుత్ కోతలు
- పొట్ట దశలో ఎండుతున్న వరి
- ఆందోళనలో అన్నదాతలు
- కాంగ్రెస్ సర్కారు స్పందించాలని వేడుకోలు
- కేసీఆర్ హయాంలో రంది లేకుంట రెండు పంటలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/తిర్యాణి, ఏప్రిల్ 1 : తిర్యాణి మండల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చెలిమెల ప్రాజెక్టు నీరు రాక.. కరెంట్ సరిగా లేక పొట్ట దశలో ఉన్న వరి చేతికందకుండా పోయేదుస్థితి నెలకొంది. గతేడాది రంది లేకుంట రెండు పంటలు తీసిన రైతాంగం ఈ యాసంగిలో అష్టకష్టాలు పడుతున్నది.

### గతేడాది 180 ఎకరాలు.. ఈసారి 80 ఎకరాలు..

తిర్యాణి మండల రైతులకు ప్రధాన సాగునీటి వనరు చెలిమెల(ఎన్టీఆర్) ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు కింద యేటా యాసంగిలో దాదాపు 200 ఎకరాల్లో వరి సాగవుతుంది. కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు కాలువలను ఆధునీకరించి యాసంగి సాగుకు భరోసానిచ్చింది. సరైన వర్షాలు లేనప్పుడు.. పంట కాలువల నీరు అందని సమయంలో రైతులు ఎంచక్కా 24 గంటల ఉచిత విద్యుత్‌తో బోరుబావుల ద్వారా పంటలు సాగు చేసుకున్నారు. గతేడాది ఈ ప్రాజెక్టు కింద దాదాపు 180 ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ యేడాది 80 ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది. కాంగ్రెస్ సర్కారు ముందుచూపులేని తనంతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. చెలిమెల ప్రాజెక్టు కాలువల్లో పిచ్చిమొక్కలు నిండిపోయి సాగు నీరు పంటలకు చేరడం కష్టంగా మారింది. ప్రాజెక్టులో ఉన్న కొద్ది పాటి నీటిని కూడా రైతులు వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది.

### కరెంట్ ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో..

చెలిమెల ప్రాజెక్టు ద్వారా నీరు అందకపోతే కనీసం బోరుబావుల నీళ్లు



పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాలువ

పెట్టుకుందామంటే.. కరెంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కేసీఆర్ సర్కారు అందించిన 24 గంటల ఉచిత కరెంట్‌తో సంబురంగా పంటలు తీసిన రైతులు, ఈ యేడాది భగీరథ యత్నం చేయాల్సి వస్తున్నది. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉండగా, ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. వ్యయప్రయాసలకోర్చి పంటలు వేశామని, కనీసం పెట్టుబడి అయినా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. కాంగ్రెస్ సర్కారు తక్షణమే స్పందించి 24 గంటల పాటు ఉచితంగా కరెంట్ ఇవ్వాలని, ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేసి సాగు నీరందించాలని వేడుకుంటున్నారు.

### దిగుబడి వస్తుందన్న నమ్మకం లేదు



*గతేడాది నాకున్న మూడెకరాలతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి వేసిన. కేసీఆర్ సర్కారు పుణ్యమాని రంది లేకుంట పంట తీసిన. కరెంట్ ఉంటదో.. ఉండదోనని ఈ సారి నాకున్న మూడెకరాల్లోనే వరి సాగు చేసిన. అనుకున్నట్లే ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా నీరు అందడం లేదు. కరెంటు కూడా ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. పంట పొట్టదశకు వచ్చింది. దిగుబడి వస్తుందన్న నమ్మకం లేదు. ఎట్లా బతుకుడో ఏమో అర్థమైతలేదు.*

**- పల్లె సుధాకర్, నాయికపుగూడ, తిర్యాణి**

### గిట్లయితే బతుకుడెట్లా?



*కేసీఆర్ సర్కారులో ఒక్కసారి కూడా పంట ఎండలే. గతేడాది సంబురంగా పంట తీసినం. ఈ యాసంగిలో మూడెకరాల్లో వరి వేసిన. ఇప్పుడు పొట్టకు వచ్చింది. ఇంకో నాలుగు రోజులు పోతే కోతలే. గీ సమయంలో నీరందని పరిస్థితి వచ్చింది. చెలిమెల ప్రాజెక్టు కాలువలు అధ్వానంగా ఉన్నయి. నీరందే పరిస్థితి లేదు. బోరుబావుల్లో ఎంతోకొంత నీరున్నా కరెంట్ ఉండడం లేదు. కిందా..మీద పడి నీళ్లు పెడుతున్నా పొలం పారడం లేదు. గిట్లయితే మేము ఎట్లా బతుకుడు.*

**- గుండం వెంకన్న, నాయికపుగూడ, తిర్యాణి**

# సింగరేణి భూమి కబ్జా చేసి.. అక్రమ లే అవుట్

## సంగమల్లయ్యపల్లెలో అనుమతి లేకుండా వెంచర్

- జైపూర్ ఓసీపీ నుంచి వెయ్యికిపైగా ట్రిప్పుల్లో మట్టి తీసుకొచ్చి పోసిన వైనం
- అక్రమార్కులకు అండగా స్థానిక కాంగ్రెస్ లీడర్
- పట్టించుకోని అధికారులు

మంచిర్యాల, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగమల్లయ్యపల్లెలో సింగరేణి భూమి కబ్జా చేయడమేగాక.. జైపూర్ ఓసీపీ నుంచి వందలాది లారీల్లో మట్టిని తీసుకొచ్చి అక్రమ లే అవుట్ చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది. సంగమల్లయ్యపల్లెలో సర్వే నంబర్ 38, 38/ఆ.. లో టీపీ(టెంటిటేటివ్ లే–అవుట్ పర్మిషన్) తీసుకోకుండానే లే అవుట్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మున్సిపాలిటీ అనుమతులు వద్దు.. డీటీసీపీకి పోవాల్సిన అవసరం లేదంటూ స్థానిక కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ భర్త తెర వెనకుండి ఈ తతంగమంతా నడిపిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ నాయకుడి అండదండలు ఉండడంతోనే అధికారులు పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నస్పూర్ మున్సిపాలిటీలో ఎంతో డిమాండ్ ఉన్న ఈ ఏరియాలో వెంచర్ వేస్తూ కనీసం నాలా కన్వర్షన్ కూడా చేసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది.



సంగమల్లయ్యపల్లెలో అక్రమ లే-అవుట్

### సింగరేణి ల్యాండ్ ఆక్రమించారా..?

సంగమల్లయ్యపల్లెలోని సర్వే నంబర్ 38, 38/ఆ.. లలో పెంట మల్లయ్య, పెంట వెంకటి పేర్ల మీద 3.06 ఎకరాల చొప్పున స్థలం ఉంది. అంటే మొత్తం 6.12 ఎకరాలు అవుతుంది. కానీ, ఇది కాకుండా ఐదు గుంటల నుంచి పది గుంటలు సింగరేణి స్థలాన్ని ఆక్రమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో నిజానిజాలు ఏమిటనేది తేలాల్సి ఉంది. నస్పూర్ పరిధిలోని కృష్ణకాలనీ నుంచి నస్పూర్ చెరువు వరకు మురుగునీరు వెళ్లేందుకు కాలువ కోసం సింగరేణి ఈ వెంచర్ పక్కనుంచి కొంత స్థలాన్ని సేకరించినట్లు తెలుస్తుంది. అలా కాలువ కోసం సేకరించిన భూమిలో దాదాపు ఐదు గుంటల నుంచి పది గుంటల వరకు ఆక్రమించి వెంచర్‌లో కలిపేసుకున్నట్లు స్థానికులు కొందరు గుసగుసలాడుకుంటున్నారు.

### మట్టి ఎక్కడి నుంచి వచ్చింది..

కాగా, ఈ వెంచర్‌లో పోస్తున్న మట్టి జైపూర్ ఓసీపీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తరలించినట్లు సమాచారం. ఈ విషయమై యాజమానులను వివరణ కోరగా, ఓ కాంట్రాక్టర్ నుంచి ట్రిప్పుకు రూ.3500 ఇచ్చి మట్టి తెప్పిస్తున్నామన్నారు. ఆయన ఎక్కడి నుంచి ఆ మట్టి తీసుకువస్తున్నరో తెలియదు కానీ.. ఇప్పటి దాకా వెయ్యి ట్రిప్పులకుపైగానే మట్టి పోసుకున్నామన్నారు. ఇంకా రెండు, మూడు వందల ట్రిప్పుల మట్టి అవసరం ఉందన్నారు. ఈ విషయమై మట్టి సరఫరా చేసే కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డిని సంప్రదించగా.. ఇందారం మండలం రామారావుపేట గ్రామంలో కుమార్ అనే వ్యక్తి మట్టి తవ్వుకునేందుకు అనుమతులు తీసుకున్నారని, అక్కడి నుంచే మట్టి తెస్తున్నామని చెప్పారు. వాస్తవానికి మైనింగ్ శాఖ అనుమతులు ఇచ్చిన వారిలో కుమార్ అనే పేరే లేదు. ఒకవేళ అనుమతులు ఇస్తే నాలుగు వేల మెట్రిక్ టన్నులు వరకు మాత్రమే ఇస్తామని, అంతకన్నా ఎక్కువ ఇవ్వడానికి లేదని మైనింగ్‌శాఖ అధికారులే చెబుతున్నారు. ఈ లెక్కన చూసుకుంటే 1200 నుంచి 1300 లారీ లోడ్‌లకు ఒక్కో లారీకి 27 మెట్రిక్ టన్నుల చొప్పున సుమారు 30వేల మెట్రిక్ టన్నులు అవుతుంది. అంతే ఈ మట్టి రైతుల పొలాల నుంచి కాకుండా వేరే దగ్గరి నుంచి వచ్చిందని ఇక్కడే అర్థమైపోతుంది. పైగా మట్టి తెచ్చి పోస్తున్న లారీలకు వే బిల్లులు కూడా లేవు. దీనిపై సదరు కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా.. వే–బిల్లులు మీకు వాట్సప్‌లో పంపిస్తామని చెప్పి తప్పించుకున్నారు. కాగా, జైపూర్ ఓసీపీ నుంచే ఈ మట్టి తెచ్చి పోస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఓసీపీ నుంచి తప్ప ఆ స్థాయిలో మట్టి తీసేందుకు జిల్లాలో మరే ప్రాంతంలోనూ అనుమతులు ఇవ్వలేదని మైనింగ్‌శాఖ రికార్డులే చెబుతున్నాయి. ఓసీపీ నుంచి మట్టి తరలింపుచుకొని వెళ్లడం పెద్ద దందా నడుస్తుందని స్థానికులు మండిపడుతున్నారు. రూ.3500 ఇస్తే ఎవ్వరికైనా మట్టి వచ్చేస్తుందని చెబుతున్నారు. ఇలా ప్రైవేట్ అవసరాలకు సింగరేణి ఓసీపీ నుంచి మట్టి తరలించడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా.. కొందరు కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



మట్టిని తీసుకొచ్చి లే-అవుట్‌లో పోస్తున్న టిప్పర్

### అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోలేదు

*సర్వే నంబర్ 38, 38/ఆ..లో వెంచర్ కోసం ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. వాస్తవానికి టీపీ తీసుకున్నాకే డెవలప్‌మెంట్ పనులు చేయాలి. ఇష్టారాజ్యంగా పని చేయడానికి లేదు. ఈ వెంచర్ విషయం ఇటీవల మా దృష్టికి వచ్చింది. పన్నుల వసూలు కార్యక్రమం కొలిక్కి రాగానే వెంటనే పరిశీలిస్తాం. నిబంధనలు అతిక్రమించిన వారు ఎవ్వరైనా సరే చర్యలు తీసుకుంటాం.*

**- చిట్యాల సతీశ్, నస్పూర్ మున్సిపల్ కమిషనర్**

## డంప్‌యార్డును పరిశీలించిన అధికారులు



డంప్‌యార్డును పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, మున్సిపల్ అధికారులు

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 1 : మంచిర్యాల పట్టణంలోని అండాళమ్మకాలనీలోగల మున్సిపల్ డంప్‌యార్డును సోమవారం పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. డంప్‌యార్డులో తరచూ మంటలు చెలరేగడం, దట్టమైన పొగ వ్యాప్తి చెందడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా కన్వీనర్ నయీంపాషా జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపేందుకు పొల్యూషన్ బోర్డు జాయింట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ హన్మంతరెడ్డి, జోనల్ ఆఫీసర్ లక్ష్మణ్‌ప్రసాద్ మంచిర్యాలకు వచ్చారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాథోడ్, సిబ్బంది ఉన్నారు. పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా డంప్‌యార్డు ఇక్కడి నుంచి తొలగించి, ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాలని సూచించారు. అనంతరం వారంతా కలిసి అదనపు కలెక్టర్ రాహుల్‌ను కలిశారు. త్వరలోనే డంప్‌యార్డు కోసం స్థలాన్ని కేటాయించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- కిష్టంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 1: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సంతోష్ అన్నారు. సోమవారం చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మిమోస పోవద్దని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం మద్దతు ధర ఏ–గ్రేడ్ రకానికి రూ. 2203, బీ–గ్రేడ్ రకానికి రూ. 2183 చెల్లిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్, తాగునీరు, నీడ, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కిషన్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్, ఏపీఎం ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.



కిష్టంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంచిర్యాల కలెక్టర్ సంతోష్

## నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

మంచిర్యాల అర్బన్/ఆసిఫాబాద్, ఏప్రిల్ 1 : వేసవి దృష్ట్యా నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఇతర శాఖల కార్యదర్శులతో కలిసి వీసీ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులతో తాగునీటి, వరిధాన్యం కొనుగోలు, పాఠశాలల మరమ్మతులు, వడదెబ్బల నియంత్రణపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. తాగునీటి సరఫరా కోసం జిల్లా ఇన్‌చార్జిగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)లను నియమించి మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో ప్రత్యేకాధికారులను నియమించి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని, చేతిపంపులు, బోర్‌వెల్‌ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరా లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందేలా చూడాలన్నారు. మిల్లర్ల నుంచి సీఎంఆర్ త్వరగా ఇచ్చేలా చూడాలని, ఇవ్వకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఇంజినీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. ఈజీఎస్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు నీడ, తాగునీరు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్, మంచిర్యాల కలెక్టర్లు ఆయా శాఖల పరిధిలో తీసుకుంటున్న చర్యలు, చేపడుతున్న పనులపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బారాయుడు, డీసీఎస్‌వో వాజిద్, డీపీవో వెంకటేశ్వర్ రావు, డీఈవో యాదయ్య, ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, మిషన్ భగీరథ ఈ.ఈ. వెంకటపతి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి తుకారాం పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లో అధికారులకు శిక్షణ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి అదనపు దీపక్ తివారీ, ఆర్డీవో సురేశ్‌కుమార్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు విధుల గురించి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీవో డైరీ, 17సీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే మాక్ పోలింగ్ నిర్వహించాలని, వీవీ ప్యాట్‌లలో ఉండే స్లిప్‌లను ప్రత్యేక కవర్‌లో భద్ర పరచాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే సెక్టోరల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బూత్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు సీల్ వేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు పోస్టర్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 450 మంది ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రిసైడింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్నా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

### అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్1 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణకు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో సురేశ్, తహశీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండేతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే సెక్టోరల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : శిక్షణకు హాజరైన పోలింగ్ అధికారులు

## ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్**

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 1 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో, మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పోలింగ్ రోజున ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విషయంలో ఇబ్బంది తలెత్తితే వెంటనే చర్యలు తీసుకోవాలని, ఫారం–13డీ, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల శాసనసభ నియోజక వర్గాల్లో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు వివరించడంతో పాటు పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఫారాలు నింపే విధానంపై వారికి అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న ప్రిసైడింగ్ అధికారి



మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

### చెన్నూర్‌లో పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు

చెన్నూర్, ఏప్రిల్ 1 : ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ఉద్యోగులకు విధులు, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎ న్నికల్లో పాల్గొనే వారంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించు కోవాలని సూచించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చంద్రకళ, చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ తహసీల్దార్లు మల్లికార్జున్, మహేంద్రనాథ్, సదానందం, వనజారెడ్డి, చంద్రశేఖర్, 360మంది పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.